నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, శుక్రవారం 15 మార్చి 2024 | KHAMMAM


# నా కుమారుడి వివాహానికి రండి

### సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ నామా ఆహ్వానం



ఖమ్మం, మార్చి 14: ఏపీలోని బాపట్ల పట్టణంలో శుక్రవారం బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు కుమారుడు భవ్యతేజ వివాహ మహోత్సవం జరుగనున్నది. వేడుకకు విచ్చేయాలని గురువారం ఎంపీ హైదరాబాద్‌లోని సీఎం స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభలేఖ అందజేశారు. బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ లీజ్ గడువును మరో 30 ఏళ్లు పొడిగించినందుకు గాను ఎంపీ నామా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వెంట ఆయన సోదరుడు నామా రామారావు ఉన్నారు.

# 'విద్యుత్ ఉద్యోగుల డీఏను వెంటనే విడుదల చేయాలి'



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పాల్వంచ, మార్చి 14: విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం (డీఏ)ను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో పాండురంగాపురం సెంటర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వజీర్ అధ్యక్షతన గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డీఏ ఇవ్వాలని కోరుతూ సీఎండీకి లిఖిత పూర్వకంగా విన్నవించినా సమస్య ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని అన్నారు. నాయకులు రాధాకృష్ణ, శ్రీధర్, అంబాల శ్రీను, సురేశ్, వెంకటేశ్వర్లు, ధనయ్య, పుల్లారావు, నాగేశ్వరరావు, యుగంధర్ పాల్గొన్నారు.

**పాలేరు జలాశయం ఏర్పడిన తరువాత ఈ తరహా నీటి కష్టాలు ఎన్నడూ రాలేదు. రిజర్వాయర్లోని నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతుండడం అటు అధికారులను, ఇటు ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఐదు జిల్లాల్లోని 2,450 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించే అధికారులు పాలేరు నుంచి నీరు ఇవ్వలేమని, ఎక్కడికక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో సాగునీటి సంగతి దేవుడెరుగు.. ముందుగా తాగునీరు అందే నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. పాలేరులో ఉన్న కాసింత నీరు కూడా వృథా కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి నీటిబొట్టునూ జాగ్రత్తగా వాడుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వేసవిలో తాగునీటి సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది. అధికారులు పాలేరు కాలువకు బూస్టర్ పంపులు ఏర్పాటు చేసి నీటిని తోడి మిషన్ భగీరథకు అందించనున్నారు. మరో 15 రోజులకు సరిపడినన్ని నిల్వలు మాత్రమే పాలేరులో ఉన్నాయి. ఈ పరిస్థితిలో వేసవి గండాన్ని గట్టెక్కించే అంశంపై ఉన్నతస్థాయిలో చర్చ జరుగుతోంది.** *–కూసుమంచి, మార్చి 14*



# తాగునీటి గండం

# గట్టెక్కేదెలా?

- ఐదు అడుగుల డెడ్ స్టోరేజీ వరకు తగ్గనున్న నీటిమట్టం
- ఎగువ ప్రాజెక్టుల్లోనూ నీరు లేకపోవడంతో సంకట స్థితి
- అప్రోచ్ కాలువలకు పంపులు.. 'భగీరథ'కు మళ్లింపులు
- స్థానిక నీటి వనరుల వినియోగానికి 'ప్రత్యామ్నాయ' ఆదేశాలు



పాలేరు జలాశయంలో నీరు లేకపోవడంతో జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో 17 మండలాల్లో సాగునీటికి, తాగునీటికి, పొరుగున ఉన్న నాలుగు జిల్లాల్లోని ప్రజల తాగునీటికి ఈ పాలేరు జలాశయమే వరప్రదాయిని. కానీ.. ఈ ఏడాది ఇందులో నీరు అడుగంటుతుండడంతో దానిమీద ఆధారపడిన ప్రజల పరిస్థితి దినదిన గండంగా మారింది. నీటిమట్టం ఐదు అడుగుల అట్టడుగు స్థాయికి పడిపోయే వరకు సాగర్ డ్యాం నుంచి నీరు వచ్చే అవకాశాలు లేవు. దీంతో పాలేరు నుంచి తాగునీటిని అందించడం సాధ్యం కాదని గుర్తించిన ఖమ్మం కార్పొరేషన్ సహా సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల మిషన్ భగీరథ అధికారులు స్థానికంగానే ఇతర మార్గాల ద్వారా తాగునీటిని అందించే చర్యలు మొదలు పెట్టారు. ఖమ్మం నగరానికి తీర్థాల కూడలి వద్ద మున్నేరు నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి పాలేరు నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడానికి రోజుకు 135.45 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నారు.



### ఐదు అడుగుల వరకు వినియోగం

పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. గురువారం ఉదయానికి 9.2 అడుగులు మాత్రమే ఉంది. 2.558 టీఎంసీలు పూర్తి సామర్థ్యం కాగా.. ప్రస్తుతం 0.779 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. రిజర్వాయర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐదు అడుగుల అట్టడుగుస్థాయి వరకు నీటిని తీసుకొని అవసరాలకు వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. అటు శ్రీరాంసాగర్ నీటిని పాలేరుకు మళ్లించడానికి అక్కడ కూడా నీళ్లు లేవు. ఇటు ఎగువ ప్రాజెక్టులదీ అదే పరిస్థితి. సాగర్ డ్యాం కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లడంతో దాని నీటిమీద రాష్ట్ర ప్రభుత్వానికి అజమాయిషీ లేకుండా పోయింది.

### బూస్టర్ పంపులతో నీటి మళ్లింపు

పరిస్థితి తీవ్రంగా ఉండడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. బూస్టర్ పంపులు ఏర్పాటు చేసి అప్రోచ్ కాలువల్లో నీటిని మిషన్ భగీరథ పంపుహౌస్‌కు మళ్లిస్తున్నారు. మరో 2 అడుగుల నీటిమట్టం తగ్గితే అప్రోచ్ కాలువ నుంచి ఇన్‌టేక్ వెల్‌కు పూర్తిస్థాయిలో నీరు అందదు. ఇప్పటికే మినీ హైడల్ ప్రాజెక్టు పక్కనే గల పాత సంప్‌కు అధికారులు జేసీబీతో గాడి కొట్టించి నీటిని మళ్లించారు. మిషన్ భగీరథ కాలువకు కూడా అడ్డంగా ఉన్న పూడికను తీసివేశారు. ప్రధాన, పాత కాలువల గేట్ల నుంచి లీకేజీలు కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

### రోజుకు 0.25 అడుగులు పడిపోతున్న నీటిమట్టం

పాలేరు జలాశయం నుంచి మిషన్ భగీరథకు రోజుకు 135.45 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇవి కాకుండా.. ఎండతీవ్రతకు ఆవిరి, చుట్టుపక్కల మోటర్ల వినియోగం వంటి కారణాలతో మరో 26 క్యూసెక్కులు ఖర్చవుతున్నాయి. దీంతో ప్రతి రోజూ 0.25 అడుగుల మేరకు నీటిమట్టం తగ్గుతోంది. ఈ క్రమంలో మరో పది రోజుల్లో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోనున్నది. ఈ నెల చివరి వరకు సాగర్ నుంచి కనీసం మూడు టీఎంసీల నీటిని వదిలి పాలేరు వరకు రెండు టీఎంసీలనైనా తెచ్చుకోకపోతే వేసవి గట్టెక్కే పరిస్థితి లేదు.

## మరో 15 రోజుల వరకే పాలేరు జలాశయ నీటి నిల్వలు

**నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నాం..**

పాలేరులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగిస్తున్నాం. వేసవిలో తాగునీటి అవసరాలకు ఇవ్వాలనే ఆలోచనతో నీటిని ఎక్కడా వృథా కానివ్వడం లేదు. కాలువలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కాలువ గేట్ల వద్ద నీరు లీక్ కాకుండా చర్యలు తీసుకున్నాం. నీటిని ట్యాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

*–విద్యాసాగర్, సీఈ, ఇరిగేషన్*

**15 నుంచి 20 రోజుల వరకూ అందించగలం..**

మిషన్ భగీరథ కొత్త ఇన్‌టేక్ వెల్ ద్వారా పాలేరులో ఉన్న నీటిని మరో 15 నుంచి 20 రోజులపాటు అందించగలుగుతాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేపట్టాం. ఈ నెల చివరి వరకు సాగర్ నుంచి నీటిని ఇవ్వాలని కోరుతున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నత స్థాయిలో నిర్ణయం జరగాల్సి ఉంది. ఇప్పటివరకు తాగునీటికి ఇబ్బదులు రాకుండా చూస్తున్నాం. ప్రజలు కూడా తాగునీటిని వృథా చేయొద్దు.

*–శ్రీనివాస్, సీఈ, గ్రామీణ తాగునీటి సరఫరా*

# గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

**అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కూనంనేని**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్/ లక్ష్మీదేవిపల్లి, మార్చి 14: మౌలిక వసతులు కల్పించి ప్రతి గ్రామాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకు అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మండలంలోని సుజాతనగర్, నిమ్మలగూడెం, కొత్త అంజనాపురం, పాత అంజనాపురం, నాయకులగూడెం, రాఘవాపురం, డేగలమడుగు, సీతంపేట బంజర తదితర పంచాయతీల్లో గురువారం పర్యటించిన ఆయన.. గ్రామాల్లో రూ.118.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంపైనా ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు శిరీష, వెంకటలక్ష్మి, సత్యనారాయణ, బాబు, మల్లికార్జున్, ఖాన్, శివలాల్, ఎంపీటీసీ భూక్యా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీదేవిపల్లిలో..**

మండలంలోని సంజయ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో నూతనంగా నిర్మించబోయే 21 షాపుల కాంప్లెక్స్‌కు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం శంకుస్థాపన చేశారు. ముర్రేడు వాగుపై కరకట్ట నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరలో పనులు ప్రారంభం చేయిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంకటేశ్వర్లు, బదావత్ గోవిందు, పూనెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సరిహద్దుల వద్ద పటిష్ట భద్రత

- పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు
- ఇరు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశంలో నిర్ణయం



భద్రతా అంశాలపై చర్చిస్తున్న రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు

మామిళ్లగూడెం, మార్చి 14 : వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రెండు రాష్ట్రాల సరిహద్దుల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు పోలీసుల మధ్య భద్రతా ఏర్పాట్లపై ఏపీ రాష్ట్రం మైలవరం ఏసీపీ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మద్యం, నగదు నియంత్రణపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా పోలీస్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో 24/7 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా సమన్వయంతో ముందుకెళ్లాలని అధికారులు సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాలు, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకెళ్లాలని నిర్ణయించారు. గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, నియంత్రణకు ప్రణాళిక రూపొందించాలన్నారు. సరిహద్దుల్లో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మైలవరం ఏసీపీ ఎస్.మురళీమోహన్, నందిగామ ఏసీపీ డాక్టర్ బి.కిరణ్ కుమార్, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ఏస్బీ ఏసీపీ పార్థసారథి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కల్లూరు ఏసీపీ రఘు, వైరా ఏసీపీ రహెమాన్, ఖమ్మం జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# రామాలయ అభివృద్ధికి ప్రణాళికలు

**కలెక్టర్ ప్రియాంక ఆల**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భద్రాచలం రామాలయ అభివృద్ధి ప్రణాళిక, భూ సేకరణ తదితర అంశాలపై దేవాదాయ, రెవెన్యూ, భూమి, కొలతలు, గ్రామ పంచాయతీ, ఐటీడీఏ అధికారులతో సమీక్షించారు. భూ సేకరణకు భద్రాచలం తహసీల్దార్, పంచాయతీ ఈవో, రామాలయ ఈఈ, మండల సర్వేయర్‌తో కూడిన జాయింట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ కమిటీ ఆలయ అభివృద్ధికి అవసరమైన భూ సేకరణకు సంబంధించిన ప్రణాళికలపై మూడు రోజుల్లోగా నివేదిక అందజేయాలన్నారు. ఆలయ పరిసరాల్లోని భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన అనుకూలమైన భూమిని గుర్తించాల్సిందిగా ఆదేశించారు. రామాలయ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పూర్తి వివరాలను అందజేయాలని ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో దామోదర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, భూమి కొలతలు, సర్వే ఏడీ కుసుమకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి, డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్, కలెక్టరేట్ భూ సేకరణ సీనియర్ సహాయకుడు యాసిన్‌పాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య రాకుండా చూడాలి

**ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**



వీసీలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, మార్చి 14 : ఉమ్మడి జిల్లాలో గిరిజన రైతులు యాసంగి పంటలు సాగు చేస్తున్న దృష్ట్యా వారికి విద్యుత్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ ఏడీ, డీఈ, ఏఈ, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్ ద్వారా పట్టాలు పొందిన గిరిజన రైతుల పంట భూములకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. విద్యుత్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో ఈ బాధ్యతను తీసుకోవాలన్నారు. అలాగే గిరిజన రైతులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలకు సంబంధించిన ఫైళ్లు ఏమైనా ఉంటే వెంటనే వాటిపై తనకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. గిరిజనులకు సరఫరా చేసే విద్యుత్‌కు ఎవరైనా ఇబ్బందులు, ఆటంకం కలిగించినా వెంటనే తన దృష్టికి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, డీటీఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీవో(పవర్) మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**రైతాంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు: భాగం**




ఖమ్మం నగరంలో ఆందోళన చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 14 : నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ చట్టాలను రద్దు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు మాట్లాడుతూ రైతాంగాన్ని విస్మరిస్తే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదన్నారు. మూడేళ్లుగా మద్దతు ధర కోసం రైతులు పోరాడుతుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు వేలకోట్ల రూపాయల రాయితీలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటే మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతులను ఇబ్బంది పెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో పతనం తప్పదన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పోటు ప్రసాద్, రామకోటయ్య, వెంకటరెడ్డి, రాంబాబు, రమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు అధికారిణులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు

**హైదరాబాద్‌లో ప్రదానం చేసిన మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు**



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 14 (నమస్తే తెలంగాణ): జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నలుగురు మహిళా అధికారులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. వారు అందించిన ఉత్తమ సేవలకుగాను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం వాటిని ప్రదానం చేశారు. మంత్రి సీతక్క, ఆ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, డీడీలు శారద, లక్ష్మిల నుంచి వారు ఈ అవార్డులను అందుకున్నారు. జిల్లా నుంచి అవార్డులు అందుకున్న వారిలో జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, అశ్వారావుపేట సీడీపీవో చంద్రకాని రోజారాణి, కొత్తగూడెం సూపర్‌వైజర్ కాగితపు రమాదేవి, అశ్వారావుపేట అంగన్‌వాడీ టీచర్ భూక్యా ప్రమీల ఉన్నారు.